

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 19-11-2025 | సంపుటి - 25 | సంచిక -184 | రూ : 4 | పేజీలు: 8




2లో

## దేశానికి పెద్దన్నగా మోదీ సహకరిస్తే
# రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి

- తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి

## రేపు సత్యసాయి, కడప జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన



2లో

- రేపు శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- పుట్టపర్తిలో ప్రధాని మోదీతో కలిసి సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరు



2లో

9.2 కిలోల బంగారంతో
# సత్యసాయి విగ్రహం

- పుట్టపర్తి రథోత్సవంలో ఊరేగింపు
- వైభవంగా బాబా శత జయంత్యుత్సవాలు ప్రారంభం
- నేడు పాల్గొననున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

## ఐబొమ్మ రవి కేసులో
# ఈడీ రంగప్రవేశం..

మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం

2లో

- ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు



2లో

## మావోయిస్టు కీలక నేత
# హిడ్మా మృతి..

- మారేడుమిల్లి ఎన్ కౌంటర్ లో హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి
- ఈ రోజు ఉదయం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తలపై రూ.6 కోట్ల రివార్డు

## మదీనా చేరుకున్న మంత్రి
# అజారుద్దీన్ బృందం

సహాయక చర్యలు ముమ్మరం

- మదీనా బస్సు ప్రమాద బాధితులకు అండగా తెలంగాణ ప్రభుత్వం
- మంత్రి అజారుద్దీన్ నేతృత్వంలో మదీనాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



2లో

## యథేచ్ఛగా..
# యాంటీ బయాటిక్స్ వాడితే ముప్పే!

- అలా చేస్తే శరీరానికి నిజంగా అవసరమైనప్పుడు పనిచేయవు
- భారత్‌లో అత్యంత ప్రమాదకరంగా ఏఎంఆర్
- ఏఐజీ అధ్యయనంలో గుర్తింపు
- లాన్సెట్ ఈ-క్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితం



2లో

## రేపు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో
# ప్రధాని మోదీ పర్యటన

- పుట్టపర్తి, కోయంబత్తూరులో ప్రధాని మోదీ పర్యటన
- పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరు
- సత్యసాయి స్మారక నాణెం, స్టాంపుల విడుదల కార్యక్రమం
- కోయంబత్తూరులో పీఎం-కిసాన్ 21వ విడత నిధుల విడుదల
- 9 కోట్ల మంది రైతులకు రూ. 18,000 కోట్లకు పైగా ప్రయోజనం



2లో

## ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో
# 32 పేజీల బుక్‌లెట్

- ప్రథమ సంవత్సరంలో ప్రశ్నపత్రాల మోడల్ మార్పుతో పేజీల పెంపు
- వృక్ష, జంతుశాస్త్రాలకు వేర్వేరుగా 24 పేజీల సమాధాన పత్రాలు



2లో



2లో

# రేపు సత్యసాయి, కడప జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

అమరావతి, నవంబర్ 18: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (నవంబరు 19) శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన రెండు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పుట్టపర్తిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొననుండగా, కడప జిల్లాలో 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబు ఇవాళ సాయంత్రమే హైదరాబాద్ నుంచి నేరుగా పుట్టపర్తికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం 9:25 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 10 గంటలకు ప్రధానితో కలిసి సాయి కుల్వంత్ హాల్‌లోని భగవాన్ శ్రీ సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. ఆ తర్వాత శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శత జయంతి ఉత్సవాల్లో ఇరువురు నేతలు పాల్గొంటారు. ప్రధాని మోదీకి వీడ్కోలు పలికిన అనంతరం, మధ్యాహ్నం 1:15 గంటలకు ముఖ్యమంత్రి కడప జిల్లా పర్యటనకు బయలుదేరుతారు. కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రికి చేరుకుని అక్కడ 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' పథకం రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేసి, అనంతరం ప్రసంగిస్తారు. ఈ రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 7,000 చొప్పున మొత్తం రూ. 3,135 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఇప్పటికే ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతగా అర్హులైన రైతులకు రూ. 7,000 చొప్పున ప్రభుత్వం అందించింది. తాజా విడతతో కలిపి ఈ పథకం ద్వారా రెండు విడతల్లో రైతులకు మొత్తం రూ. 6,309.44 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. పెండ్లిమర్రిలో నిధుల విడుదల కార్యక్రమానికి ముందు సీఎం స్థానిక గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక పార్టీ కేడర్‌తో సమావేశమై, రాత్రికి అమరావతికి తిరిగి రానున్నారు.

## మావోయిస్టు కీలక నేత హిడ్మా మృతి...
### నిర్ధారించిన పోలీసులు

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈరోజు ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా మృతిచెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య రాజీ, మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో మరణించారు. ఈమేరకు హిడ్మా, రాజే మరణించిన విషయాన్ని పోలీసులు నిర్ధారిస్తూ వారి మృతదేహాల ఫొటోలను రిలీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలకు సంబంధించి కచ్చితమైన సమాచారంతో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ఈరోజు ఉదయం కూంబింగ్ చేపట్టాయని ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు.

**గెరిల్లా దాడుల వ్యూహకర్త..**

చిన్న వయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీకి ఎంపికైన హిడ్మా.. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరొందారు. ఆయన స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామం. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ హిడ్మా పనిచేశారు.

**మృతులు..**

మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్.

## రేపు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన

ఆంధ్రప్రదేశ్, నవంబర్ 18: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు, కోయంబత్తూరులో జరిగే రైతుల సదస్సులో పీఎం కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "నవంబర్ 19న పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర సోదరీమణుల వద్దకు వెళ్లాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు. సత్యసాయి బాబా సమాజ సేవను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని గుర్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం, ప్రధాని బుధవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం చేరుకుని, శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని సందర్శించి నివాళులర్పిస్తారు. అనంతరం 10:30 గంటలకు జరిగే శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా గౌరవార్థం ఒక స్మారక నాణెం, ప్రత్యేక స్టాంపులను విడుదల చేసి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి ప్రధాని మోదీ తమిళనాడులోని కోయంబత్తూరుకు బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 1:30 గంటలకు 'దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సు 2025'ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా పీఎం కిసాన్ పథకం 21వ విడత కింద రూ. 18,000 కోట్లకు పైగా నిధులను విడుదల చేస్తారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 50,000 మంది రైతులు, నిపుణులు పాల్గొననున్నారు.

## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం...

హైదరాబాద్, నవంబర్ 18: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది.

## మదీనా చేరుకున్న మంత్రి అజారుద్దీన్ బృందం..
### సహాయక చర్యలు ముమ్మరం

హైదరాబాద్, నవంబర్ 18: సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన 45 మంది ఉమ్రా యాత్రికుల కుటుంబాలకు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం మంగళవారం మదీనా నగరానికి చేరుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫియుల్లా, ఏఐఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో కూడిన ఈ బృందం, సౌదీ అధికారులు మరియు జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటోంది. జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్‌తో తాము సమావేశమైనట్లు మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మృతుల కుటుంబాల ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవప్రదంగా అన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం, ఈ కష్టకాలంలో వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నాం" అని మంత్రి తెలిపారు. ఆదివారం రాత్రి మదీనా నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో యాత్రికులతో వెళుతున్న బస్సు, డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి హైదరాబాద్‌కు చెందిన 45 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఒక యాత్రికుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మతపరమైన సంప్రదాయాల ప్రకారం మృతుల అంత్యక్రియలు సౌదీ అరేబియాలోనే నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. సోమవారం జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశ నిర్ణయం మేరకు ఈ ఉన్నతస్థాయి బృందాన్ని సౌదీకి పంపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ప్రతి కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ అరేబియాకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విదేశాంగ శాఖ, సౌదీ అధికారులతో సమన్వయం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేశారు. బాధితులకు సహాయం అందించేందుకు జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం మదీనాలో ఒక క్యాంప్ ఆఫీసును కూడా ఏర్పాటు చేసింది.

## ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 32 పేజీల బుక్‌లెట్

అమరావతి : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు 32 పేజీల సమాధాన పత్రాల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఫస్టియర్‌లో జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను అమలుచేయడంతో పాటు ప్రశ్నపత్రాలను మార్చారు. తొలిసారి ఒకమార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రశ్నల సంఖ్య పెరిగింది. గణితంలో గతంలో 150 మార్కులకు రెండు పేపర్లు ఉండగా.. ఈసారి వంద మార్కులకు ఒకటే పేపర్‌ను తీసుకొచ్చారు. భౌతిక, రసాయనశాస్త్రాల సబ్జెక్టుల్లో 85 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీంతో సమాధానాల బుక్‌లెట్ పేజీలను పెంచారు. ఇప్పటివరకు 24 పేజీల బుక్‌లెట్ ఉండగా.. ఇకనుంచి 32 పేజీలది ఇస్తారు. గణితం, భౌతిక, రసాయనశాస్త్రాలు, చరిత్ర, ఆర్థికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, కామర్స్‌లకు 32 పేజీల బుక్‌లెట్ ఉంటుంది. జీవశాస్త్రంలో.. వృక్షశాస్త్రానికి 24 పేజీలు, జంతుశాస్త్రానికి 24 పేజీల చొప్పున రెండు బుక్‌లెట్‌లిస్తారు. ప్రశ్నపత్రంలో ఏ, బీ సెక్షన్లుగా విడిగా వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలుంటాయి. విద్యార్థులు జవాబులను విడివిడిగా బుక్‌లెట్‌లలో రాయాలి. మిగతా సబ్జెక్టులకు గతంలో మాదిరిగానే 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఉత్తీర్ణతకు 35% లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా.. దీన్ని 29కి తగ్గించారు. ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారు. రెండు సంవత్సరాలకు కలిపి 35% కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా.. 59 మార్కులనే ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ అరమార్కును సర్దుబాటు చేసి, రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు. మొదటి ఏడాదిలో కొన్ని సబ్జెక్టుల్లో 30% మార్కులొచ్చినా ఉత్తీర్ణులే. మొత్తమ్మీద 35% రావాలి. ఏదైనా ఒక సబ్జెక్టులో అత్యధిక మార్కులు వచ్చి, మిగతా వాటిల్లో 30% చొప్పున వచ్చినా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు. జాగ్రఫీ పరీక్షను గతంలోలాగే 75 మార్కులకు నిర్వహించి, 85 మార్కులకు లెక్కిస్తారు. మొదటి ఏడాది 15, రెండో ఏడాది 15 కలిపి ద్వితీయ సంవత్సరంలో 30 మార్కులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్నలకు ఛాయిస్ ఉండదు. వృక్షశాస్త్రం 43, జంతుశాస్త్రం 42 మార్కులకు ఉంటాయి. గ్రూపు ఐదు సబ్జెక్టులు కాకుండా ఆరో సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్న దానిలో ఉత్తీర్ణత తప్పనిసరి కాదు. ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టుల మార్కులతో మెమో ఇస్తారు. ఒకవేళ ఉత్తీర్ణులైతే వేరేగా ప్రత్యేక మార్కుల మెమో ఇస్తారు.

## ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు..
### ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం

బీహార్, నవంబర్ 18: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. జగదానంద్ సింగ్ కూడా ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీ సొంత ఏజెంట్లు సంతకం చేశారని తెలిపింది.

## 9.2 కిలోల బంగారంతో సత్యసాయి విగ్రహం

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలోని అంతర్జాతీయ ఆధ్యాత్మిక పట్టణం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణలు, వేలమంది భక్తుల సాయి నామస్మరణల నడుమ వెండి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. 9.2 కిలోల బంగారంతో సిద్ధం చేసిన సత్యసాయి ఉత్సవ విగ్రహాన్ని 31.8 అడుగుల ఎత్తయిన వెండి రథంలో ప్రతిష్ఠించి పట్టణ వీధుల్లో ఊరేగించారు. రథం తయారీలో 180 కిలోల వెండిని, పూతగా కిలో బంగారాన్ని వినియోగించారు. మంగళవారం ఉదయం వేదపఠనంతో కార్యక్రమాలు మొదలవగా, విశ్వశాంతిని కాంక్షిస్తూ మహా సమాధి వద్ద 1,100 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించాయి. సాయికుల్వంత్ మందిరం నుంచి సత్యసాయి, వేణుగోపాలస్వామి, సీతారామ, హనుమాన్ ఉత్సవ విగ్రహాలను.. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, వేద పండితులు తీసుకురాగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏటా వేణుగోపాలస్వామి రథోత్సవం నిర్వహించేవారు. ఈ ఏడాది కొత్తగా సత్యసాయి రథోత్సవాన్ని ప్రారంభించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు సత్యసాయి దర్శనంతో పులకించారు. రథోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీశ్‌కుమార్, సినీనటుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం రాత్రి సత్యసాయి బాబా తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

## దేశానికి పెద్దన్నగా నరేంద్ర మోదీ సహకరిస్తే
### అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి

హైదరాబాద్, నవంబర్ 18: దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకమవుతుందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ మరో కొత్త నగరాన్ని నిర్మించాలని చూస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో పరస్పరం సహకారంతో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్రం కృషి చేస్తోందని, ఈ క్రమంలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కేంద్రం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని నిర్దేశించుకుందని, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు.

## యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్ వాడితే ముప్పే!

హైదరాబాద్: వైద్యుల సూచన లేకుండానే మందుల దుకాణానికి వెళ్లి యాంటీ బయాటిక్ మందులు కొనుక్కొని వాడితే ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లేనని, తరచూ వీటి వినియోగంతో శరీరానికి నిజంగా అవసరమైన రోజు అవి పనిచేయకుండా పోతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీలో అమెరికా, ఇటలీ, నెదర్లాండ్స్‌కు చెందిన వారితోపాటు భారతీయులు కలిపి దాదాపు 1,200 మందిపై జరిపిన అధ్యయనంలో ఈ విషయం బయటపడింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 80 ఏళ్ల వయసున్న 300 మంది భారతీయులను పరీక్షించగా... దాదాపు 83% మంది ఈ ముప్పును ఎదుర్కొంటున్నారని తేలింది. ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత లాన్సెట్ ఈక్లినికల్ మెడిసిన్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. మంగళవారం ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, సహ పరిశోధకులు డాక్టర్ హార్దిక్ రుగ్వానీతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇంత లోతైన పూర్తి పరిశోధన చేయడం దేశంలో ఇదే తొలిసారని డాక్టర్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "జలుబు, దగ్గు, గొంతు నొప్పి లాంటి వైరల్ వ్యాధులకు వైద్యుల సూచనలు లేకుండా యాంటీ బయాటిక్స్ వాడటం ఎంత ప్రమాదమో.. వారు సూచించిన మందులన్నీ పూర్తిస్థాయిలో వాడకపోయినా అంతే ముప్పు ఉంటుంది. ఇలా చేయడం వల్ల శరీరానికి యాంటీ బయాటిక్ నిరోధకత వస్తుంది.

# త్వరలో భద్రాద్రి కొత్తగూడెంకు సీఎం రాక

- **కొత్తగూడెం లో మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ ప్రారంభోత్సవానికి రండి**
- **సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల ఆహ్వానం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహ్వానించారు.మంగళవారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి తుమ్మల కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు అధికారికంగా ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఖచ్చితంగా జిల్లా పర్యటనకు వస్తానని పేర్కొన్నారు.



*** డిసెంబర్ మొదటి వారంలో పర్యటన ఖరారు**

మంత్రి తుమ్మల ఆహ్వానం మేరకు సీఎం రేవంత్ స్పందిస్తూ డిసెంబర్ 1 నుండి 8 వరకు ఏ తేదీనైనా కార్యక్రమాన్ని చేపట్టొచ్చు. అనుకూలమైన రోజు నిర్ణయించుకుని తెలియజేస్తానని సూచించారు.దీంతో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఖరారైంది.

*** ప్రారంభోత్సవానికి సిద్ధం కావాలని ఆదేశం**

సీఎం రానున్న విషయం ఖరారైన వెంటనే మంత్రి తుమ్మల, విద్య శాఖ సెక్రటరీ శ్రీధర్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు, సంబంధిత శాఖలకు తక్షణమే కీలక ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ వేదిక, స్టేజ్, లేఅవుట్ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్డు, వసతులు, పార్కింగ్, రాకపోకలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని,భద్రత విషయాల్లో లోపాలు లేకుండా పోలీసు శాఖతో సమన్వయంతో పని చేయాలన్నారు. అతిథుల నిర్వహణ, వసతి, మీడియా సెంటర్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల సూచించారు. విశ్వవిద్యాలయ భవనాలు, ల్యాబ్‌లు, మౌలిక వసతుల పరిశీలనకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## కూకట్ పల్లి పాత శివాలయంలో ఘనంగా శివ–పార్వతుల కల్యాణోత్సవం




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కార్తీక మాసం పురస్కరించుకుని కూకట్ పల్లి పాత శివాలయంలో శివ-పార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, రంగారావు దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పథకం ప్రకారమే మహిళా జర్నలిస్టులపై అసభ్యకర పోస్టులు

- **మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేసిన ప్రతినిధి బృందం**
- **కఠినచర్యలు తప్పవు కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదా**




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : మహిళా జర్నలిస్టులపై సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న బెదిరింపులు, అసభ్యకర పోస్టులు, దుర్భాషలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదా హామీ ఇచ్చారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ నేతృత్వంలో స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా మహిళా జర్నలిస్టుల ప్రతినిధి బృందం కమిషన్ చైర్ పర్సన్ ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ స్వరూపాన్ని చూపించే అనేక వీడియోలను చైర్ పర్సన్ కు ప్లే చేసి చూపించింది. పలు సోషల్ మీడియా హ్యాండిల్లు నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నాయని వారు తెలిపారు.తమపై "క్రమబద్ధమైన ఆన్‌లైన్ వేధింపుల ధోరణి" కొనసాగుతోందని తెలిపారు. కొన్ని హ్యాండిల్లు, ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు, ప్రాణహానికర బెదిరింపులు, అవహేళనాత్మక పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నాయని చెప్పారు.ఈ ట్రోలింగ్ భయం కలిగించడం, తమ వృత్తిపరమైన పనిని అడ్డుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోందని వారు పేర్కొన్నారు. విద్వేషపూరిత, మతపరమైన ఉద్రిక్తత కలిగించే కంటెంట్‌ను కూడా ఈ హ్యాండిల్లు విస్తృతంగా పోస్ట్ చేస్తున్నాయని తెలిపారు.సంబంధిత హ్యాండిల్లు, వ్యక్తులపై దర్యాప్తు చేసి, ఐపీసీ, ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆన్‌లైన్-భౌతిక రక్షణను కల్పించాలని కోరారు. ఈ వేధింపులు మీడియా స్వేచ్ఛపై దాడి మాత్రమేనని, మహిళా జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని చెప్పారు.

## తాగునీటి పైప్ లైన్ వేయించాలని కార్పొరేటర్ కు వినతి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ మహంకాళి నగర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వారి కాలనీ కి తాగునీటి పైప్ లైన్ వేయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సమస్యను ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో మంజీరా పైప్ లైన్ సంక్షన్ చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, ప్రకాష్, సాయిలు, మన్యం, ప్రేమ్, మదన్, నారాయణ, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

*** భరోసా సెంటర్ ఎస్సై చల్లా అరుణ**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా వారి హక్కులను కాపాడుకోవచ్చునని భరోసా సెంటర్ ఎస్సై చల్లా అరుణ తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా/మొబైల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు, పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రాముఖ్యతను మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై అరుణ వివరించారు. భరోసా బృందానికి చెందిన కో-ఆర్డినేటర్ రేణుక, లీగల్ సపోర్ట్ పర్సన్ శిరీష, సభ్యులు అంబికా, రమాదేవి, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ సంధ్యారాణి, రిసెప్షనిస్ట్ అనూషలు తమ తమ బాధ్యతలు, వారు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అనూరాధ, మహిళ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారులు, సిబ్బంది, సఖి సిబ్బంది, మహిళా సాధికరికత కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## హెడ్డాఫీస్‌లో బీసీ లైజన్‌సెల్ ఏర్పాటు చేయాలి

*** డైరెక్టర్ (పా)కు బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:సింగరేణి ప్రధాన కార్యాలయమైన కార్పొరేట్ బిల్డింగ్‌లో, అన్ని ఏరియాలలోని జిఎం కార్యాలయాల్లో బీసీ లైజన్ సెల్ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ బిసి అండ్ ఓబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అమిరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డైరెక్టర్ పా గౌతమ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి బీసీ కార్మికుల వివిధ అంశాలపై వినతి పత్రం సమర్పించి చర్చించారు. ముఖ్యంగా అన్ని ఏరియాలలో బిసి కార్మికులు సమావేశాలు ఏర్పాటు చేసుకొనుటకు ఒక క్వార్టర్‌ను కార్యాలయంగా ఉపయోగించుకోవడానికి కేటాయించాలని నాయకులు కోరారు. జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అన్ని ఏరియా జీఎం ఆఫీసులలో ఏర్పాటు చేయాలని, ఆయన జయంతికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు నిధులు కేటాయించాలని కోరారు. బీసీ కార్మికులందరికీ దామాషా పద్ధతిలో ఫోకల్ పాయింట్లలో, కీ పొజిషన్‌లో నియమించాలని, ఇన్ సర్వీస్ క్యాడర్ ప్రమోషన్లలో బీసీ కార్మికులకు దామాషా పద్ధతిలో నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై డైరెక్టర్ పా సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ లైసెన్ ఆఫీసర్ హరి శంకర్, జనరల్ సెక్రెటరీ ఎం.రమేష్, వైస్ ప్రెసిడెంట్ వెన్నమ వెంకటేశ్వరరావు, కార్పొరేట్ లైసెన్ ఆఫీసర్ వేముల మురళి, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ గోలి వెంకటేశ్వరరావు, కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం..

### లారీ ఢీకొని ముగ్గురి మృతి

కర్నూలు: నగరంలోని కేశవ గ్రాండ్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నలుగురు రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఘటనా స్థలంలో ఇద్దరు, చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. ఇంతియాజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు కర్నూలుకు చెందిన లక్ష్మీ నారాయణ, రామిరెడ్డి, గోకులపాడుకు చెందిన వడ్డె శ్రీనుగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## జేఏసీ బలోపేతానికి యువత ముందుకు రావాలి

**: వైస్ ఛైర్మన్ బానోత్ వీరు నాయక్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యానగర్ కాలనీలో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బంజారా సంఘాల జేఏసీని బలోపేతం చేయడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురికి బాధ్యతలు అప్పగించారు. జిల్లా యువజేఏసీ కో కన్వీనర్లుగా ధరావత్ కబీర్‌దాస్, జాటోత్ భరత్, భూక్యా రాంబాబును నియమించారు. దివ్యాంగుల విభాగం జిల్లాకో కన్వీనర్లుగా భూక్యా రాములు, ధరావత్ కాశీరాంలకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ధరావత్ కాన్సిరాం, మూడ్ జయరాం చౌహాన్, ట్రెజరర్ బానోతు రమేష్ నాయక్, జిల్లా కోకన్వీనర్లు లావుడియా సత్యనారాయణ, మాలోత్ శివ నాయక్, గుగులోత్ శంకర్ నాయక్, మాజీ ఎంపీపీ మూడ్ చిట్టిబాబు చౌహాన్, మాజీ సర్పంచ్ లావుడియా కిషన్ నాయక్, మాలోత్ మంగ్యా, మాలోత్ రవి, బానోత్ అమృరు, బానోత్ రవి, భూక్య శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలి

*** ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ.**




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ శ్రేణులు సత్తా చాటాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఇల్లందు బీఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం జేకే కాలనీ వీఆర్ఎఫ్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు సతమతమవుతున్నారని, రేవంత్‌రెడ్డి సర్కార్ రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. లోకల్ బాడీ ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆ దిశగా నాయకులు కార్యకర్తలు ముందుకు సాగి ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను తెలియజెప్పేలా కార్యాచరణ రూపొందించాలన్నారుతెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నాని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు పంచాయితీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

# జల్ సంచయ్ – జన్ భాగీదారీ జాతీయ అవార్డును సాధించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నీటి సంరక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాధించిన విశేష ఫలితాలకు గాను ప్రతిష్ఠాత్మక 'జల్ సంచయ్-జన్ భాగీదారీ' జాతీయ అవార్డు దక్కింది. ఈ అవార్డును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, డీఆర్డీవో విద్యా చందనతో కలసి మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యం, శాఖల సమన్వయంతో 29,103 నీటి సంరక్షణ పనులు పూర్తి చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయస్థాయి మూడో జోన్‌లో కేటగిరీ-3లో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. ఈ విజయానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చిన ప్రజల భాగస్వామ్యం, గ్రామస్థాయి సంస్థల చురుకుదనం, శాఖల సమన్వయం కారణంగానే ఈ జాతీయ అవార్డు సాధ్యమైందన్నారు. జల్ సంచయ్ - జన్ భాగీదారీ కార్యక్రమం కేవలం ప్రభుత్వ ప్రాజెక్ట్ కాకుండా, నీటి విలువపై ప్రజల్లో అవగాహన పెంచిన సామూహిక జల సంరక్షణ ఉద్యమంగా మారింది అని అన్నారు. ఇంకుడు గుంతలు వర్షపు నీటిని నేలలోకి వెళ్లి, గ్రామాల్లో నీటి లభ్యతను పెంచడంలో, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించాయి అని అభిప్రాయపడ్డారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేయడం, గ్రామస్థాయి ప్రజల అంకితభావం ఈ విజయానికి ప్రధాన కారణం. భవిష్యత్తులో కూడా చెరువుల పునరుద్ధరణ, వాగుల అభివృద్ధి, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ అన్నారు. డీఆర్డీవో విద్యా చందన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీటి సంరక్షణపై విస్తృత అవగాహన, పనుల నాణ్యత, శాఖల సమన్వయం కలిసి జాతీయస్థాయి గుర్తింపుకు దోహదపడ్డాయన్నారు. ఈ విజయం మొత్తం జిల్లా బృందం కృషికి ప్రతీక అని తెలిపారు.

# సంగం వద్ద ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



సంగం: నెల్లూరు జిల్లా సంగం వద్ద ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు కింద భాగంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన కానిస్టేబుల్ నాగార్జున తన బైక్‌పై ముందుకు వెళ్లి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే బస్సు నిలిపిన డ్రైవర్, మొత్తం 45 మంది ప్రయాణికులను క్షేమంగా కిందకు దించడంతో ప్రమాదం తప్పింది. ఇంజన్ ఆపేయడంతో మంటలు ఆగిపోయాయి. ప్రమాదం నుంచి కాపాడినందుకు ప్రయాణికులు.. కానిస్టేబుల్ నాగార్జునకు అభినందనలు తెలిపారు. మరో బస్సులో ప్రయాణికులను పంపించారు. ఆర్టీసీ బస్సు 45 మంది ప్రయాణకులతో నెల్లూరు నుంచి ఆత్మకూరు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# శబరిమలకు పోటెత్తిన అయ్యప్ప భక్తులు



శబరిమలకు అయ్యప్పస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. నిన్న గుడి తలుపులు తెరుచుకోగా.. వేలాదిగా అయ్యప్ప భక్తులు శబరిమల చేరుకుంటున్నారు. దీంతో స్వామి దర్శనానికి 16 గంటలకు పైగా సమయం పడుతోంది. కిలోమీటర్ల మేర భక్తుల పడిగాపులు కాస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన అయ్యప్ప భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నట్టు సమాచారం.

# ఘనంగా ఐటీడీఏ భద్రాచలం జోనల్ స్థాయి గిరిజన క్రీడల వేడుకలు ప్రారంభం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఐటీడీఏ భద్రాచలం జోనల్ స్థాయి గిరిజన క్రీడలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి గిరిజన సంక్షేమ అధికారి జి.అశోక్ అధ్యక్షత వహించగా, గిరిజన అభివృద్ధి ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, భద్రాచలం ప్రజాప్రతినిధి చల్ల వెంకట్రావు, అశ్వరావుపేట ప్రజాప్రతినిధి జారె ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాజెక్టు అధికారి రాహుల్ మాట్లాడుతూ గిరిజన పాఠశాలల్లో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ఈ సంవత్సరం నూతన క్రీడలైన సాఫ్ట్‌బాల్, ఫుట్బాల్, వెయిట్ లిఫ్టింగ్ బరువెత్తుగత్తె వంటి విభాగాలను ఎంపిక చేసిన ఆశ్రమ పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతిభావంతులను గుర్తించి రాష్ట్ర స్థాయి సాయి క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రత్యేక శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు భవిష్యత్తులో దేశస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు పాఠశాల దశ నుంచే క్రీడా సాధనను బలపరచాలని సూచించారు. అనంతరం అతిథులు బాలక్రీడలను, సంప్రదాయ విలువిద్యా క్రీడలను ప్రారంభించారు. ఖమ్మం, వైరా, దుమ్ముగూడెం, మణుగూరు, పాల్వంచ, దమ్మపేట, ఇల్లందు 7 జోన్ల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డిడి విజయలక్ష్మి, క్రీడా అధికారి బొల్లి గోపాలరావు, దమ్మపేట ఎటిడిఓ చంద్రమోహన్, ఇల్లందు ఎటిడిఓ , జిసిడిఓ మంగతాయారు, ఏఎస్ఓలు కోమరం వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, శంకర్ ,సీనియర్ పిడిలు బుగ్గ వెంకటేశ్వర్లు, ఏ. నగేశ్, బాలసుబ్రమణ్యం, హరికృష్ణ, సైదులు, నరసయ్య, వీరాంజి, హర్జా, సక్రాం, ప్రసాద్, మోతిలాల్, పిఈటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.




# ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్ కౌంటరే

* ఈ ఎన్ కౌంటర్లపై న్యాయవిచారణ జరపాలి
* సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడవి హిడ్మాతో పాటు మరో ఐదుగురిది ముమ్మాటికీ బూటకపు ఎన్ కౌంటరే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ కౌంటర్ల పేరుతో నరహత్యలకు పాల్పడుతోందని ఆవేదనవ్యక్తం చేశారు. అసలు ఎన్ కౌంటర్ అంటే ఇరు పక్షాలు ఎదురెదురుగా కాల్చుకునేది అని,కానీ ప్రస్తుతం హిడ్మా ఎన్ కౌంటర్ చూస్తుంటే వారిని పట్టుకుని తెచ్చి కాల్చి చంపినట్లుగా ఉందన, దానికి కట్టుకథ అల్లి ఎన్ కౌంటర్ అనే అందమైన పేరు పెడుతున్నారని మండిపడ్డారు., 2026 మార్చి నెలాఖరు నాటికి మావోయిజాన్ని లేకుండా చేస్తామని చెప్పిన మోడిషాలు వారి చెప్పిన మాటకు సార్ధకత చేకూరేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్ కౌంటర్ పాటు ఇప్పటి వరకు చోటు చేసుకున్న వలు ఎన్ కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించి న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తూ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించడం సరైంది కాదని, ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే మంచిదే కాదనీ, ఏకపక్షంగా వ్యవహరిస్తూ కనీస అవకాశం ఇవ్వకుండా చేయడం మంచివద్ధతి కాదన్నారు. దేశంలో బిజెపి అరాచక పాలన సాగిస్తోంది, గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మొట్టికాయ వేశారని, బిహార్ ఎన్నికల్లో ఓట్ల గల్లంతుకు పాల్పడటంతో పాటు అయినవారి ఓట్లను కలుపుకుని విజయ సాధించినట్లు చెప్పుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా బూటకపు ఎన్ కౌంటర్లు, మత గర్షణలకు, మతాలు, కులాల పేరుతో విభజనలకు స్వస్తి వలికి దేశంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు నలిగంటి శ్రీనివాస్, జి వీరస్వామి, చంద్ర నరేంద్ర, వంట్టికొండ మల్లికార్జునరావు, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వంగా వెంకట్, రత్నకుమారి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

జల్ సంచయ్ - జన్ భాగీదారీ జాతీయ అవార్డును సాధించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నీటి సంరక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాధించిన విశేష ఫలితాలకు గాను ప్రతిష్ఠాత్మక 'జల్ సంచయ్-జన్ భాగీదారీ' జాతీయ అవార్డు దక్కింది. ఈ అవార్డును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, డీఆర్డీవో విద్యా చందనతో కలసి మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యం, శాఖల సమన్వయంతో 29,103 నీటి సంరక్షణ పనులు పూర్తి చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయస్థాయి మూడో జోన్‌లో కేటగిరీ-3లో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించింది. ఈ విజయానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చిన ప్రజల భాగస్వామ్యం, గ్రామస్థాయి సంస్థల చురుకుదనం, శాఖల సమన్వయం కారణంగానే ఈ జాతీయ అవార్డు సాధ్యమైందన్నారు. జల్ సంచయ్ - జన్ భాగీదారీ కార్యక్రమం కేవలం ప్రభుత్వ ప్రాజెక్ట్ కాకుండా, నీటి విలువపై ప్రజల్లో అవగాహన పెంచిన సామూహిక జల సంరక్షణ ఉద్యమంగా మారింది అని అన్నారు. ఇంకుడు గుంతలు వర్షపు నీటిని నేలలోకి వెళ్లి, గ్రామాల్లో నీటి లభ్యతను పెంచడంలో, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించాయి అని అభిప్రాయపడ్డారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేయడం, గ్రామస్థాయి ప్రజల అంకితభావం ఈ విజయానికి ప్రధాన కారణం. భవిష్యత్తులో కూడా చెరువుల పునరుద్ధరణ, వాగుల అభివృద్ధి, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలను మరింత వేగవంతం చేస్తామని కలెక్టర్ అన్నారు. డీఆర్డీవో విద్యా చందన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీటి సంరక్షణపై విస్తృత అవగాహన, పనుల నాణ్యత, శాఖల సమన్వయం కలిసి జాతీయస్థాయి గుర్తింపుకు దోహదపడ్డాయన్నారు. ఈ విజయం మొత్తం జిల్లా బృందం కృషికి ప్రతీక అని తెలిపారు.

# ప్రైవేటు పాఠశాలల నిర్వహకులకు రక్షణ కల్పించాలి

: ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి






కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ప్రైవేటు పాఠశాలల నిర్వహకులపై బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వారి నుంచి పాఠశాలల నిర్వహకులకు రక్షణ కల్పించాలని తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని విఐపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వరంగల్ జిల్లాలో పిడిఎస్ యూ నాయకులు పాఠశాల యాజమాన్యంపై బౌతిక దాడులకు దిగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా తరుచుగా జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సేవే పరమావధిగా నిర్వహిస్తున్న పాఠశాలలను రక్షణ కరువైందని, రక్షణ కల్పించాలని వాపోయారు. కులసంఘాలు, విద్యార్థి సంఘాలు, జేఏసీలు, రాజకీయ పార్టీల అనుబంద సంఘాలు అంటూ ఇలా నిత్యం ప్రతి పాఠశాల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూనే ఉన్నారని అన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు బడ్జెట్ పాఠశాలలు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయని గుర్తు చేశారు. ట్రస్మా రాష్ట్ర కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనల మేరకు పాఠశాలల నిర్వహణ కోసం సంఘం తగిన సలహాలు సూచనలను అందిస్తుందని తెలిపారు. ఇఎస్ ఐ, పిఎఫ్, ప్రొఫెషనల్ టాక్స్ తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా అంశాలపై రాష్ట్ర కమిటి ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, అధికార పత్రినిధి రాంచందర్, సత్యారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు లతో పాటు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన కమిటి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, కె.ఆంజనేయులు, కె.శ్రీనివాస్‌లు, ఎస్.సోమశేఖర్, ధనలక్ష్మి, ఎస్.అశోక్‌రెడ్డి, మథ్యూ జోసఫ్, తాజోద్దీన్, స్వరూప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఆంజనేయులు, కార్యనిర్వహక కార్యదర్శులుగా సిహెచ్ నర్సింహులు, ఎస్. ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా వీరన్న, జి.మన్‌మోహన్‌రావు, ఎం.సాయిగణేష్, జి.విజయ్ భాస్కర్‌రెడ్డి, టి.లిథియా, సి.శ్రీనివాస్ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, ఈ.దశరథ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులుగా సిహెచ్ మహేందర్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఆనంద్, మల్లిఖార్జున్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనాథ్‌రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పుట్టపర్తిలో మాజీ ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర మంత్రులు

నేటి నుంచి పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల కోసం పుట్టపర్తి అంగరంగ వైభవంగా ముస్తాబైంది. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిస్తోంది. ప్రముఖుల రాకపోకలతో ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ క్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పుట్టపర్తికి చేరుకున్నారు. వారితో పాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు. వారంతా సత్యసాయిబాబా సమాధిని దర్శించుకుని నివాళులు అర్పించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. అనంతరం బాబా ఊరేగింపులో పాల్గొన్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.



# రాహుల్ సిప్లిగంజ్ వివాహం.. సీఎం రేవంత్‌ను ఆహ్వానించిన సింగర్

హైదరాబాద్: గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అతి త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. కాబోయే భార్య హరిణ్యతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం సాయంత్రం మీట్ అయ్యారు. తమ వివాహానికి ఆహ్వానిస్తూ పెళ్లి శుభలేఖను అందించారు. రాహుల్ హరిణ్యల వివాహం ఈ నెల 27న జరగనుంది. వీరిద్దరికీ ఆగస్టులో నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తెదేపా నేత, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరుడి కుమార్తె హరిణ్యా రెడ్డి . ఓల్డ్ సిటీ నుంచి 'ఆస్కార్' వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్‌ను 'గద్దర్' అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సీఎం రేవంత్ కొనియాడిన విషయం తెలిసిందే. 'కాలేజ్ బుల్లోడా', 'వాస్తు బాగుందే', 'రంగా రంగా రంగస్థలానా', 'బొమ్మోలే



ఉన్నదిరా పోరి' లాంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర స్పెషల్ సాంగ్స్‌తో రాహుల్ శ్రోతలను విశేషంగా అలరించారు. 'రంగమార్తాండ'తో నటుడిగానూ ఆకట్టుకున్నారు. కాలభైరవతో కలిసి రాహుల్ పాడిన 'నాటు నాటు' (ఆర్ఆర్ఆర్) పాటకు ఆస్కార్ అవార్డు దక్కింది.




## హైదరాబాద్‌లో ముగిసిన ఆదాయపన్ను శాఖ సోదాలు

హైదరాబాద్: నగరంలోని 15 చోట్ల ఆదాయపన్ను శాఖ అధికారులు ఏక కాలంలో సోదాలు నిర్వహించారు. పిస్తా హౌస్, షా గౌస్, మెహిఫిల్ హోటళ్లలో అధికారులు తనిఖీలు ముగిశాయి. ఈ హోటళ్లు ఏటా వందలకోట్ల వ్యాపారం చేస్తున్నాయి. పిస్తా హౌస్, షా గౌస్ హోటళ్లు ఇతర నగరాల్లోనూ నడుస్తున్నాయి. దుబాయ్‌లోనూ వాటికి బ్రాంచ్‌లు ఉన్నాయి. భారీగా పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ యజమాని మాజిద్ నివాసంలో, కార్మికుల గదుల్లో హార్డ్ డిస్క్‌లు, దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు.

## పోలవరంబనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోంది: మంత్రి ఉత్తమ్



ఢిల్లీ: పోలవరంబనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో భేటీ అనంతరం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరాం. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరాం. మా ప్రభుత్వంలో కేఆర్ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అడిగాం.. మరో 20 టెలిమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్ 2లో 9, ఫేజ్ 3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.



## సీసీఐ తుగ్లక్ నిర్ణయాలతో పత్తి రైతులకు కష్టాలు

**: హరీశ్‌రావు**

వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలు, సీసీఐ తుగ్లక్ నిర్ణయాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 విధానాల కారణంగా.. గత రెండు రోజులుగా సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లు బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌ను పార్టీ నాయకులతో కలిసి హరీశ రావు సందర్శించారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, ఎకరానికి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారు.

## దేశంలో తెలంగాణ టాప్..

జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో రాష్ట్రానికి అవార్డుల పంట పండింది. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు 2024లో.. జాతీయ స్థాయిలో రాష్ట్రం తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రం మొత్తం 5,20,362 పనులు పూర్తిచేసింది. కాగా.. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. పీఆర్, ఆర్డీ కమిషనర్ డా.శ్రీజన రాష్ట్రపతి ద్రౌపది చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్-2 ఫలితాలు రద్దు.. తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్2 పరీక్ష రద్దు చేసింది. 2015 16లో నిర్వహించిన గ్రూప్2లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధిదాటి వ్యవహరించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ 8 వారాల్లో ముగించాలని హైకోర్టు ఆదేశించింది. వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా.. మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్‌మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 2015లో టీజీపీఎస్సీ గ్రూప్2 నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో రాతపరీక్షలు నిర్వహించింది.



2019లో గ్రూప్2 నియామకాలు చేపట్టింది. దీనిపై పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు వెలువరించారు.

## ఇందిరా గాంధీ జయంతి.. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం కానుక

హైదరాబాద్: తెలంగాణలోని మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం కోటి మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తోందని చెప్పారు. సమాజంలో మహిళల గౌరవం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల పథకం ఇదని వెల్లడించారు. బుధవారం (నవంబర్ 19)



నుంచి డిసెంబర్ 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో మొదటి విడతగా, మార్చి 1 నుంచి 8 వరకు రెండో విడతగా పట్టణాల్లో చీరల పంపిణీ జరగనుంది. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కానుక ఇది అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## ఐ-బొమ్మ రవి పోలీసులకు చిక్కాడిలా.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

హైదరాబాద్: ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక విషయాలను పొందుపర్చారు. ఐ బొమ్మకి సంబంధించిన రెండు డొమైన్లను రవి ప్రధానంగా నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. rao. ibomma.foo, bappam.dev డొమైన్లతో 65 మిర్రర్ వెబ్‌సైట్లను సృష్టించాడని రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. ఇవన్నీ ఐ బొమ్మ, బప్పం టీవీ కింద నడుస్తున్నాయి. పైరసీ చేసిన సినిమాలను ఈ వెబ్‌సైట్లలో పెడుతూ వాటి మధ్యలో వన్‌విన్, వన్‌ఎక్స్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ.. లక్షల రూపాయలు సంపాదిస్తున్నాడని వెల్లడించారు. ఐ బొమ్మ నుంచి రీడైరెక్ట్ అయి బెట్టింగ్ సైట్లకు వెళ్లడం ద్వారా వ్యక్తిగత డేటా చౌర్యం జరుగుతోంది. కొందరు బెట్టింగ్ యాప్ వల్ల జీవితాలను కోల్పోయారు. ఇదంతా పథకం ప్రకారం జరుగుతున్నట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితుడు ఇమంది రవి తనకున్న సబ్‌స్క్రైబర్లను, సినిమా ప్రొడ్యూసర్లను సైతం బెదిరించాడని, దీనిపై కేసు నమోదు చేసి అతడ్ని అరెస్టు చేశామని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో వివరించారు.




### రెండు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు

ఆగస్టు 30న తెలుగు ఫిలిం ఛాంబర్ యాంటీ పైరసీ సెల్ విభాగం ఫిర్యాదు ఇచ్చి, పైరసీకి సంబంధించిన సాక్ష్యాధారాలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించి కీలక విషయాలను రాబట్టామని పోలీసులు స్పష్టం చేశారు. కొత్తగా విడుదలైన సినిమాలు, ఓటీటీలో వచ్చిన కంటెంట్ హెచ్‌డీ ఫార్మెట్‌లో ఐబొమ్మ, దాని అనుబంధ సైట్లలో ప్రత్యక్షమవుతున్నాయి. కీలక నిందితుడు ఇమంది రవి గురించి ఆరా తీసిన పోలీసులు అతను రెండు సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. అమెరికాలోని ఆరిజోనా చిరునామాతో ఒక డొమైన్, మరొకటి హైదరాబాద్‌లోని అమీర్‌పేట అడ్రస్‌తో రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధరించారు. వీటి ఆధారంగా ఇమంది రవి ఫోన్ నెంబర్ దొరికింది. దాని సీడీఆర్ తనిఖీ చేయగా.. అతను కూకట్‌పల్లి రెయిన్‌బో విస్టా అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు తేలింది. అతని ఇంటికి పోలీసులు వెళ్లగా.. తలుపులు తీయకుండా గంటన్నరపాటు ముప్పు తిప్పలు పెట్టాడు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారింగా చేసిన తప్పును ఒప్పుకున్నాడు. అయితే తలుపులు తీయకుండా ఇంట్లో ఉన్న గంటన్నరలో టెలిగ్రామ్ డేటా, తన ఫోన్‌లోని డేటా మొత్తాన్ని క్లియర్ చేశాడు. వ్యక్తిగత ల్యాప్‌ట్యాప్ బాత్రూమ్‌లోని రూఫ్ కింద పెట్టి, సెల్ ఫోన్ బీరువాలో దాచినట్లు తెలిసింది. ఎక్కడికి వెళ్లినా సర్వర్లకు కనెక్టు చేసేందు సాఫ్ట్‌వేర్ ఉన్న పరికరాలను రవి తన వెంట తీసుకెళ్లేవాడని సమాచారం.

### ప్రహ్లాద్ పేరుతో పాస్‌పోర్ట్..

ఇమంది రవిని అరెస్టు చేసిన సమయంలో పోలీసులు ఇంట్లో ఉన్న రెండు ఫోన్లు, ప్రహ్లాద్ కుమార్ పేరుతో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, 18 హార్డ్‌డిస్క్‌లు, 21 బ్యాంక్ పాసు పుస్తకాలు, ద్విచక్రవాహనం, ల్యాప్‌ట్యాప్‌లు, సీపీయూలు, 34 డెబిట్, క్రెడిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అతనికి సహకరించిన బాలాజీ, ప్రశాంత్ అనే మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. ఇమంది రవిపై మొత్తం 5 కేసులు నమోదయ్యాయని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. రవి ప్రధానంగా ఐ బొమ్మకి అనుసంధానంగా పదుల సంఖ్యలో డొమైన్‌లు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు తేలింది. ఎప్పటికప్పుడు తన డేటా వివరాలను ధ్వంసం చేస్తూ తప్పించుకు తిరిగాడు. కొంత డేటాను పలు క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్, రిజిస్ట్రీస్‌లలో నిల్వ చేశాడు. ఫిర్యాదులు ఇస్తున్న సినీ పరిశ్రమను సైతం బెదిరించాడు. తన మీద ఫోకస్ చేయడం ఆపకపోతే... మీపైన ఫోకస్ చేయాల్సి ఉంటుందని బెదిరించినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు పొందుపర్చారు.

## రైతులు అధైర్యపడకండి.. మీకు అండగా BRS ఉంది: కేటీఆర్

నేరడిగొండ: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి కష్టం లేకుండా చూశామని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అప్పుడు ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ధాన్యం గింజ కొన్నామన్నారు. మళ్లీ మనమే అధికారంలో వస్తామని.. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డ్‌లో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడేందుకు కేటీఆర్



వచ్చారు. ఆయనకు నేరడిగొండ టోల్ ప్లాజా వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వాగతం పలికారు. అనంతరం నేరడిగొండ జిన్నింగ్ మిల్లులో సోయాబీన్, మొక్క జొన్న పంట కొనుగోలు కేంద్రాలను కేటీఆర్ పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని.. మీకు అండగా కేసీఆర్, భారత రాష్ట్ర సమితి పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు.

# మోదీ.. ఎలక్షన్ మోడ్ కాదు ఎమోషనల్ మోడ్: శశిథరూర్





ఢిల్లీ: మోదీ సర్కారు అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మరోసారి ప్రధానిని ప్రశంసించారు. సోమవారం దిల్లీలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి తనను ఆహ్వానించారని.. ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీ భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి ప్రసంగించారని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని అందరూ అంటారని తన ప్రసంగంలో మోదీ వెల్లడించిన అంశాన్ని థరూర్ గుర్తు చేశారు. కానీ ప్రజల సమస్యల విషయంలో ప్రధాని ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని కితాబిచ్చారు. దేశంలో విద్యపై వలసవాద ప్రభావం ఏ విధంగా ఉందనే విషయం గురించి మోదీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. వలసవాద ఆలోచనా విధానం నుంచి బయటపడాలంటే భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థలను తిరిగి పునరుద్ధించాల్సిన అవసరముందని ఆయన చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొంటూ.. ప్రధాని మోదీకి సంబంధించిన ఫొటోలను సైతం షేర్ చేశారు. థరూర్ చేసిన పోస్టుపై కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు థరూర్ ఏ పార్టీలో కొనసాగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. థరూర్ ప్రధానిని ప్రశంసించడం ఇది మొదటిసారి కాదు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరిగిన దౌత్యపరమైన కృషి జాతీయ సంకల్పం, ప్రభావవంతమైన వ్యక్తీకరణకు ప్రధానిని రుజువుగా పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు, ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దృఢమైన ప్రతిస్పందనను చాటిచెప్పిందని కేంద్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. ఫిబ్రవరిలో టారిఫ్‌ల విషయంలో ట్రంప్‌తో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో మోదీ హుందాగా నడుచుకున్నారని ప్రశంసించారు.

## నీతీశ్‌లా బిహార్‌ను అర్థం చేసుకోలేకపోయా! ప్రశాంత్ కిశోర్



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించకపోవడంపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తొలిసారి స్పందించారు. తాము నిజాయతీగా ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యామని అన్నారు. తప్పిదాలను సరిదిద్దుకొని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఈ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి 100శాతం బాధ్యత తనదేనన్నారు. ఈ సందర్భంగా అధికార కూటమిపై తీవ్ర విమర్శలు గుప్పించిన పీకే.. కుల, మతాల పరంగా ప్రజలను విభజించి, డబ్బుతో ఓట్లు కొన్న నీతీశ్, భాజపా నేత సామ్రాట్ చౌదరీల మాదిరిగా తాను బిహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యానని వ్యంగ్యంగా పేర్కొన్నారు.

**236 మంది డిపాజిట్లు కోల్పోయి..**

బిహార్‌లో రెండు కూటములకు ప్రత్యామ్నాయం తామేనని ప్రజల్లోకి వెళ్లిన ప్రశాంత్ కిశోర్ జన్‌సురాజ్ పార్టీ 238 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించింది. కానీ, ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేకపోయింది. ఈ పార్టీకి 3.44శాతం ఓట్లు వచ్చాయి. 68 అసెంబ్లీ స్థానాల్లో నోటా కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. అంతేకాదు జన్‌సురాజ్‌కు చెందిన 236 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.

* **రూ.10వేలు ఇవ్వకుంటే వారికి 25 సీట్లే..**

ఓటమిని అంగీకరించడంలో ఎటువంటి భేషజాలు లేవని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. వ్యవస్థాగత మార్పును పక్కనపెడితే.. ప్రభుత్వంలోనైనా మార్పు తీసుకురాలేకపోయామని, అయినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు మార్చడంలో కచ్చితంగా కొంత పాత్ర పోషించామన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారులకు నీతీశ్ ప్రభుత్వం రూ.10వేల చొప్పున ఇవ్వకుంటే ఆ పార్టీ 25 స్థానాలకే పరిమితమయ్యేదని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఓట్లు పొందకపోవడం నేరం కాదని, అయితే.. అవినీతి, విభజన రాజకీయాలు మాత్రం తాను చేయలేదని అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు.

## ప్రతిపక్ష నేతగా ఉండేందుకు తేజస్వీ యాదవ్ విముఖత..!

బిహార్‌లో ప్రతిపక్ష నేతగా ఉండేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విముఖత చూపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహిస్తూ.. తేజస్వి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉండటానికి నిరాకరించారు. అనంతరం తన తండ్రి, ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్ సర్దిచెప్పడంతో ఆ పదవిలో ఉండడానికి అంగీకరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో తాను ఇప్పుడు ఎమ్మెల్యేగా పనిచేయాలనుకుంటున్నానని, ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టడం తనకు ఇష్టంలేదని తేజస్వి పేర్కొన్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఓటమి



పాలయ్యామని.. అందుకు తానే పూర్తి బాధ్యత వహిస్తానని ఆయన అన్నట్లు తెలిపారు. అయితే పార్టీని ముందుకు నడిపించడానికైనా ప్రతిపక్ష నేత స్థానంలో ఉండాలని లాలూ సర్ది చెప్పడంతో చివరికి ఒప్పుకున్నారన్నారు. అదే సమావేశంలో బిహార్ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన 25 మంది ఆర్జేడీ ఎమ్మెల్యేలు.. తమ శాసనసభాపక్ష నేతగా తేజస్విని ఎన్నుకున్నట్లు ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ తెలిపారు.

* **సంజయ్ యాదవ్‌పై ఆరోపణలను ఖండించిన తేజస్వీ..**

ఎన్నికల్లో ఆర్జేడీ పేలవమైన ప్రదర్శనకు, ప్రస్తుతం లాలూ కుటుంబంలో జరుగుతున్న ఘర్షణలకు పార్టీ నేత సంజయ్ యాదవ్‌నే కారణమని వస్తున్న ఆరోపణలను తేజస్వీ ఖండించారు. తనకున్న అత్యంత విశ్వసనీయ అనుచరుల్లో సంజయ్ ఒకరని..పార్టీ ప్రచార వ్యూహాలను రూపొందించడం, అభ్యర్థులను ఖరారు చేయడం వంటి ఎన్నికల సన్నాహాలలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఇటీవల లాలూ కుటుంబం నుంచి విడిపోతున్నట్లు ప్రకటించిన ఆయన కుమార్తె రోహిణి ఆచార్య ఆర్జేడీ ఎంపీ సంజయ్‌యాదవ్, తేజస్వీ మిత్రుడు రమీజ్‌ఖాన్ కారణంగానే తాను పార్టీని వీడుతున్నట్లు ఆరోపించారు.

## హిడ్మా ఎన్‌కౌంటర్‌పై అమిత్ షా డెడ్‌లైన్..!

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలుమావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశారు. నవంబరు 30లోపు హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. "2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందడం గమనార్హం. అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం జరుగుతోన్న ఆపరేషన్లను చూస్తుంటే.. మార్చి కంటే ముందుగానే నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని అంచనావేశాయి. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని



నరేంద్ర మోదీ నిర్ణయించారని గతంలో అమిత్ షా పేర్కొన్న సంగతి తెలిసిందే. హింసను, ఆయుధాలను వదిలేసి వారు లొంగిపోవాలని లేకపోతే మావోయిస్టుల అంతానికి ఆల్ అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మారేడుమిల్లి ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

## హసీనాను భారత్ అప్పగిస్తుందా..? రూల్స్ ఏం చెబుతున్నాయి?

మానవత్వాన్ని మరచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరడంపై భారత్ ఆచితూచి స్పందించింది. హసీనాను భారత్ అప్పగిస్తుందా? లేదా ఆ దేశ అభ్యర్థనను తోసిపుచ్చుతుందా? అన్న విషయం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో అసలు ఇరు దేశాల మధ్య ఒప్పందంలోని నిబంధనలు ఏం చెబుతున్నాయనే విషయాన్ని పరిశీలిస్తే..

**భిన్న పరిస్థితి..**

సరిహద్దులో చొరబాట్లు, ఉగ్రవాద సమస్యను ఎదుర్కొనేందుకు భారత్, బంగ్లాదేశ్‌లు 2013లో అప్పగింత ఒప్పందంపై సంతకాలు చేశాయి. దేశం విడిచి పారిపోయిన వారిని అప్పగించేందుకు వీలుగా 2016లో ఇందులో సవరణలు చేశాయి. 1971 విమోచన యుద్ధానికి సంబంధించిన కేసుల పరిష్కారం దృష్ట్యా బంగ్లాదేశ్.. సరిహద్దులో దాక్కున్న యూఎల్ఎఫ్ఏ వేర్పాటువాదులను తిరిగి రప్పించే ఉద్దేశంతో భారత్.. ఈ ఒప్పందం చేసుకున్నాయి. కానీ, ప్రస్తుతం హసీనా కేసు మాత్రం వీటికి భిన్నంగా కనిపిస్తోంది. అభియోగాలు నమోదు కావడం, నిందితుడిగా ఉండటం లేదా దోషిగా తేలిన సందర్భంలో.. సంబంధిత వ్యక్తుల అప్పగింతకు విజ్ఞప్తి చేయాలని ఒప్పందం స్పష్టంగా చెబుతోంది. హసీనా కేసులో బంగ్లాదేశ్ ఐసీటీ అరెస్టు వారెంట్ జారీ చేసినందున



అక్కడి చట్టాల ప్రకారం ఆమెను అప్పగించాలన్న విజ్ఞప్తి విధానపరమైన షరతుకు లోబడే ఉన్నట్లు. అయితే, ఎవరినైనా అప్పగించాలంటే ద్వంద్వ నేర సూత్రం పరిధిలో ఉండాలని ఒప్పందంలోని పలు నిబంధనలు చెబుతున్నాయి. అంటే.. ఆ నేరం అనేది ఇరుదేశాల చట్టాల ప్రకారం శిక్షార్హమైనదిగా ఉండాలి. మానవత్వాన్ని మరచి తీవ్ర నేరాలకు పాల్పడటం అనేది బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం శిక్షార్హమైనవి. భారత్ మాత్రం ఇటువంటి వాటిని భిన్న కోణంలో చూస్తుంది. దీంతో హసీనాపై మోపిన అభియోగాలు ఇక్కడి చట్టాల ప్రకారం.. ఆమెను అప్పగించేందుకు చెల్లవని భారత్ వాదించే అవకాశం ఉందని తెలుస్తోంది.

**మినహాయింపులు..**

అప్పగింతకు సంబంధించి ఒప్పందంలో కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఆరోపించిన నేరాల విషయంలో రాజకీయ కోణం ఉందని భావిస్తే ఆ విజ్ఞప్తిని తిరస్కరించే అవకాశం ఉంది. న్యాయం చేసే ఉద్దేశం లేకపోవడం, దురుద్దేశాలతో అప్పగింత విజ్ఞప్తి చేసినట్లు భావించినా.. తిరస్కరించేందుకు వీలుంది.

## బుల్లెట్ రైలు తొలి పరుగు ఎప్పుడు? ఎంత దూరం?



ముంబయి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ బుల్లెట్ రైలు 2027 ఆగస్టులో పట్టాలెక్కనుంది. తొలి పరుగులో ఈ రైలు గుజరాత్‌లోని సూరత్ నుంచి వాపి మధ్య 100 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేయనుంది. ఈ వివరాలను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం వెల్లడించారు. గతంలో సూరత్ నుంచి బిల్లిమోరా మధ్య కేవలం 50 కిలోమీటర్లకే ఈ పరుగు ఉండేలా ప్రణాళికలు రచించారు. కానీ ఇప్పుడు ఆ దూరాన్ని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**ప్రాజెక్టు వివరాలు**

దేశంలో ఈ మొదటి హైస్పీడ్ రైలు మార్గాన్ని అహ్మదాబాద్ నుంచి ముంబయి వరకు నిర్మిస్తున్నారు. వీటి మధ్య దూరం 508 కిలోమీటర్లు. బుల్లెట్ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా దీనిని రూపొందిస్తున్నారు. ఈ మొత్తం దూరాన్ని కేవలం 2 గంటల 17 నిమిషాల్లో పూర్తి చేస్తుంది. 12 స్టేషన్లలో ఆగుతుంది. నాలుగు స్టేషన్లలో మాత్రమే ఆపితే ముంబయి నుంచి అహ్మదాబాద్ కేవలం 1 గంట 58 నిమిషాల్లో చేరుకోవచ్చు.

**2029 నాటికి పూర్తి**

ఈ ప్రాజెక్టుకు 2017లో శంకుస్థాపన జరిగింది. నిజానికి, ఇది 2023 డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ లాంటి కొన్ని సమస్యల వల్ల ఆలస్యమైంది. మంత్రి వైష్ణవ్ చెప్పిన ప్రకారం.. మొత్తం బుల్లెట్ రైలు ప్రాజెక్టు 2029 సంవత్సరం చివరి నాటికి పూర్తిగా అందుబాటులోకి వస్తుంది.

**రైలు సాంకేతికతపై సందిగ్ధత**

తొలి ప్రయాణంలో ఏ రకమైన రైలును ఉపయోగిస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. రైల్వే మంత్రిత్వ శాఖ సిగ్నలింగ్ వ్యవస్థ కోసం సీమెన్స్ నేతృత్వంలోని సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. అయితే, ఈ వ్యవస్థ జపాన్‌కు చెందిన 'షింకన్‌సెన్' బుల్లెట్ రైలుకు సరిపోకపోవచ్చని పారిశ్రామిక నిపుణులు అంటున్నారు. దీంతోపాటు గంటకు 250 కిలోమీటర్ల వేగంతో నడిచే హైస్పీడ్ రైలును దేశీయంగా తయారుచేయాలని రైల్వే శాఖ 'భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్'ను కోరింది. అందుకే 2027 ఆగస్టులో జపాన్ రైలు నడుస్తుందా లేక మన దేశంలో తయారైన రైలు నడుస్తుందా? అనే దానిపై స్పష్టత రాలేదు.

ప్రధాని మోదీ సంతృప్తి

నిర్మాణంలో ఉన్న సూరత్ స్టేషన్‌ను ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణ వేగంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దీని నుంచి నేర్చుకున్న విషయాలను కేవలం రైల్వేల్లోనే కాకుండా ఇతర రంగాల్లోనూ ఉపయోగించాలని సూచించారు.

## చిన్నారుల మిస్సింగ్ కేసుల పెరుగుదల ఆందోళనకరం: సుప్రీం కోర్టు



దేశంలో చిన్నారుల మిస్సింగ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ.. మిస్సింగ్ కేసులు దేశంలో తీవ్రమైన సమస్యగా మారుతున్నాయని పేర్కొంది. దత్తత ప్రక్రియ కఠినంగా ఉన్నందువల్ల.. పిల్లలు లేనివారు చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటున్నారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సంక్లిష్టంగా ఉన్న దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, అక్రమ దత్తతను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే విధానం ఎక్కువయ్యిందని.. దత్తత ముసుగులో చిన్నారుల అక్రమ రవాణా, అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తప్పిపోయిన పిల్లల కేసులపై విచారణ చేపట్టడానికి నోడల్ అధికారిని నియమించడానికి ఆరు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరపు న్యాయవాది కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన ధర్మాసనం డిసెంబర్ 9 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. మిస్సింగ్ కేసులను నిర్మూలించడానికి ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పేర్కొంది.

## జైషే పేరుతో.. దిల్లీలోని కోర్టులు, విద్యాసంస్థలకు బాంబు బెదిరింపులు

దిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. కోర్టులు, విద్యాసంస్థలే లక్ష్యంగా కొందరు దుండగులు ఈమెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. తీస్ హజారీ, సాకేత్ కోర్టులు లక్ష్యంగా దిల్లీ పోలీసులకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఇది పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే పేరుతో వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపుల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే ద్వారక, సాకేత్, పటియాలా హౌస్, రోహిణి కోర్టులను కూడా అప్రమత్తం చేశారు. అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. ద్వారక, ప్రశాంత్ విహార్‌లోని రెండు సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు కూడా బెదిరింపులు వచ్చాయి. ఇప్పటివరకు ఎలాంటి అనుమానిత వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బెదిరింపులకు పాల్పడిన వారిని కనుగొనేందుకు దర్యాప్తు చేపట్టారు. ఇక, ఇటీవల ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే.

## ఆరు రోజుల తర్వాత.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఆరు రోజుల లాభాల తర్వాత నష్టాల్లో ముగిశాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రతికూల పవనాలతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అమ్మకాలతో అస్థిరతకు గురయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం 85,042.37 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 85,042.41పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. 84,558.36 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. చివరకు 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు తగ్గి 25,910.05 వద్ద ముగిసింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గింది. అయితే, నిఫ్టీ మిడ్‌క్యాప్ 61,220.25 పాయింట్ల సరికొత్త రికార్డు గరిష్ట స్థాయిని తాకిన తర్వాత 0.6 శాతం దిగువన ముగిసింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఇంట్రాడేలో 59,103.65 తాజా గరిష్ట స్థాయిని తాకిన తర్వాత స్వల్ప నష్టాలతో ముగిసింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, మెటల్, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ ప్రధాన లాభాలను ఆర్జించాయి. టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్, జియో ఫైనాన్షియల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి.

## ఏఐని గుడ్డిగా నమ్మకండి: సుందర్ పిచాయ్




**కాలిఫోర్నియా:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వార సేకరించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మవద్దు అని గుగూల్ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ అన్నారు. ఓ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ మోడల్స్‌లో పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. సమాచార స్పష్టత కోసం ఏఐతో పాటు ఇతర విధానాలను కూడా సరిచూసుకోవాలని ఆయన సూచించారు.

సుసంపన్నమైన సమాచార వ్యవస్థను రూపొందించుకోవాలని, కేవలం ఏఐ టెక్నాలజీ మీద మాత్రమే ఆధారపడవద్దు అని ఆయన అన్నారు. దీని కోసమే ప్రజలు గూగుల్ సెర్చ్ వాడుతున్నారని, కచ్చితమైన సమాచారం ఇచ్చేందుకు తమ వద్ద ఇతర వ్యవస్థలు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ ఏదైనా సృజనాత్మకంగా రాయాలని భావిస్తే, అప్పుడే ఏఐ టూల్స్‌ను సక్రమంగా వినియోగించే రీతిలో ఉండాలని, ఆ టూల్స్ చెప్పే ప్రతి దాన్ని గుడ్డిగా నమ్మరాదు అని అన్నారు.

కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చేందుకు చాలా వర్క్ చేస్తున్నామని, దీని పట్ల గర్వంగా ఉందన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న ఏఐ విధానాలతో సమస్యలు వచ్చే అవకాశాలు కూడా ఉన్నట్లు చెప్పారు. గూగుల్ ఏఐ తాజా మోడల్ జెమిని 3.0 కోసం టెకీ ప్రపంచం ఎదురుచూస్తున్నది. గూగుల్ తన సెర్చ్ ఇంజిన్‌లో ఏఐ మోడ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. యూజర్ల కోసం జెమిని చాట్‌బాట్‌ను జోడించింది. ఏఐ సెక్యూర్టీ గురించి కూడా పెట్టుబడి పెంచినట్లు పిచాయ్ తెలిపారు. ఏదైనా ఇమేజ్ ఏఐ ద్వారా వచ్చిందా లేదా అని తెలుసుకోవడానికి ఓపెన్ సోర్స్ టెక్నాలజీ అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.

## చైనా ఫార్ములాలో.. యువత 72 గంటలు పనిచేయాలి

### ఇన్ఫీ నారాయణమూర్తి



**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి మరోసారి హెడ్‌లైన్స్‌లో నిలిచారు. ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఆయన మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. మన దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే యువత వారానికి 72 గంటలు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైనాలో ప్రసిద్ధి చెందిన 9-9-6 రూల్‌ను ఉదాహరణగా చెప్పారు.

ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడిన మూర్తి.. చైనా ఆర్థిక వ్యవస్థను ఎదుర్కోవాలంటే యువత మరింత కష్టపడి పనిచేయాలన్నారు. 'చైనాలో 9-9-6 అనే పాలసీ ఉంది. దాని అర్థం ఏంటో తెలుసా..? ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వారానికి 6 రోజులు పనిచేయడం. మొత్తం 72 గంటలు పనిచేయడం' అని అన్నారు. భారతీయ యువత ఈ పనిగంటలను అనుసరించాలని వ్యాఖ్యానించారు. ముందు యువత తమ కెరీర్ నిర్మించుకోవడంపై దృష్టిపెట్టాలని తర్వాతే వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

కాగా, ఆర్థిక వ్యవస్థ ఉరకలెత్తేందుకు, ఉత్పాదకత పెరిగి మనం అగ్ర దేశాలతో పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి%-% అని నారాయణ మూర్తి చెప్పారు. అయితే, ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇంత సుదీర్ఘ గంటలు పనిచేస్తే మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పని-జీవితం మధ్య సమతూకం దెబ్బతింటుందనే విమర్శలు వెల్లువెత్తాయి.



# కోల్‌కతాలోనే టీమిండియా..

### గంభీర్ నేతృత్వంలో చెమటోడ్చిన ప్లేయర్లు..!






**కోల్‌కతా:** దక్షిణాఫ్రికాతో జరిగిన తొలిటెస్టులో భారత జట్టు పరాజయం పాలైంది. ఈ నెల 22 నుంచి గౌహతిలో రెండోటెస్టు జరుగనున్నది. అయితే, ఈ పరాజయంతో రెండురోజులు విశ్రాంతి తీసుకోవడానికి బదులుగా జట్టు శిక్షణ తీసుకోవడంలో నిమగ్నమైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు సభ్యులు పలువురు మంగళవారం ప్రాక్టీస్ చేశారు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారతదేశం 0-1తో వెనుకపడింది. రెండోటెస్టును ఎలాగైనా సమయం చేసి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తున్నది. కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వంలో భారత ఆటగాళ్లు ఈడెన్ గార్డెన్స్‌లో శిక్షణ పొందారు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ మాత్రం ప్రాక్టీస్‌లో కనిపించలేదు.

చాలామంది బ్యాట్స్‌మెన్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ధ్రువ్ జురెల్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెట్స్‌లో బ్యాటింగ్ చేయగా.. ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్, కోల్‌కతాకు చెందిన పలువురు బౌలింగ్ చేశారు. కోల్‌కతా టెస్ట్‌లో భారత జట్టు ఓటమిని పాలైంది. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్లు సైమన్ హార్మర్, కేశవ్ మహారాజ్‌లపై భారత బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బందిపెట్టారు. టర్నర్ పిచ్‌లతోనే దక్షిణాఫ్రికాను ఇరుకున పెట్టాలని భావించిన టీమిండియా.. అదే వ్యూహంతో బోల్తాపడింది. నెట్ సెషన్‌లో సాయి సుదర్శన్, జురెల్ స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. ఇద్దరూ ప్యాడ్‌లు ధరించి ముమ్మరంగా సాధన చేశారు. సాయి సుదర్శన్‌కు తొలి టెస్టు తుదిజట్టులో చోటు దక్కలేదు. అయితే, గౌహతి మ్యాచ్‌లో కూడా ఛాన్స్ లభించే అవకాశాలు తక్కువే.

అలాగే, ధ్రువ్ జురెల్ కుడి కాలుకు ప్యాడ్‌లు లేకుండా సాధన చేయడం కనిపించింది. రివర్స్ స్వీప్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాడు. ఈ ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌లో హెడ్‌కోచ్ గంభీర్ సాయి సుదర్శన్ ప్రాక్టీస్‌ను నిశితంగా పరిశీలించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్థానం కోసం సాయి సుదర్శన్ పోటీ పడుతున్నాడు. కోల్‌కతా టెస్టులో గిల్ గాయపడ్డ విషయం తెలిసిందే. రెండో టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. అయితే, సుదర్శన్ నెట్స్‌లో ఇబ్బంది పడుతున్నట్లు కనిపించాడు. నెట్ బౌలర్లు చాలా ఇబ్బంది పెట్టారు. గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సైతం బ్రేక్ టైమ్‌లో సాయి సుదర్శన్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. చాలా సేపు బ్యాటింగ్ చేసిన జడేజాతో సహా ఆరుగురు ప్లేయర్లు మాత్రమే ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు.

## టీమిండియా సూచన మేరకే పిచ్ తయారుచేశా

### ఈడెన్ గార్డెన్స్ పిచ్ క్యురేటర్ సుజన్ ముఖర్జీ

### మూడు రోజుల్లోనే ముగిసిన భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్ట్

### ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై వెల్లువెత్తిన విమర్శలు

### క్యూరేటర్‌కు మద్దతుగా నిలిచిన కోచ్ గంభీర్, గంగూలీ



**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి టెస్టు కేవలం మూడు రోజుల్లోనే ముగియడంతో పిచ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, ఆ పిచ్‌ను టీమిండియా యాజమాన్యం సూచనల మేరకే రూపొందించినట్లు తేలింది. భారత కోచ్ గౌతమ్ గంభీర్, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ స్వయంగా ఈ విషయాన్ని ధ్రువీకరించడంతో వివాదానికి తెరపడింది.

ఈ మ్యాచ్‌లో ఏ జట్టు కూడా 200 పరుగుల మార్కును దాటలేకపోయింది. బౌలర్ల ఆధిపత్యం నడుమ దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీపై విమర్శలు వచ్చాయి. దీనిపై ఆయన స్పందిస్తూ, "భారత శిబిరం నుంచి ఎలాంటి పిచ్ కావాలో స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. వారు చెప్పిన ప్రకారమే నేను పిచ్‌ను సిద్ధం చేశాను. నా పనిని పూర్తి అంకితభావంతో చేశాను. ఇతరుల వ్యాఖ్యలను నేను పట్టించుకోను" అని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సుజన్‌కు మద్దతుగా సౌరభ్ గంగూలీ మాట్లాడుతూ, "టీమిండియా కోరుకున్న పిచ్‌నే తయారు చేశాం. మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి పిచ్‌కు నీళ్లు పెట్టడం ఆపేశాం. అందుకే అది అలా స్పందించింది. ఇందులో క్యూరేటర్ తప్పు లేదు" అని స్పష్టం చేశారు. టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఇదే విషయాన్ని అంగీకరించారు. "మా సూచనల మేరకే పిచ్‌ను సిద్ధం చేశారు. ఇది బ్యాటర్లకు మరీ అంత కఠినమైన పిచ్ ఏమీ కాదు. ఇలాంటి పిచ్‌పై ఓపికగా డిఫెన్స్ ఆడితే పరుగులు వస్తాయి" అని పేర్కొన్నారు.

124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, 93 పరుగులకే ఆలౌట్ అయింది. సిరీస్‌లో నిలవాలంటే గువాహటి వేదికగా నవంబర్ 22న ప్రారంభం కానున్న రెండో టెస్టులో టీమిండియా తప్పక గెలవాల్సి ఉంది.

## కోల్‌కతా టెస్ట్‌లో టీమిండియా సెల్ఫ్ గోల్..

### ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన గవాస్కర్, అశ్విన్..!





**కోల్‌కతా:** దక్షిణాఫ్రికాతో కోల్‌కతా వేదిక జరిగిన టెస్టులో భారత జట్టు ఘోర పరాజయం పాలైంది. టీమిండియా బ్యాట్స్‌మెన్ స్పిన్ ఆడడంలో ఉన్న బలహీనతను మరోసారి బయటపెట్టింది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ టర్నింగ్ పిచ్ కావాలని కోరుకుంది. కానీ, ఆ నిర్ణయే టీమిండియాకు శాపంగా మారింది. టర్నింగ్ పిచ్‌తో ప్రయోజనం పొందాలని ఆశించిన భారత బ్యాట్స్‌మెన్ దక్షిణాఫ్రికా స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డారు. ఈ క్రమంలో మాజీ స్పిన్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ భారత బ్యాట్స్‌మెన్ స్పిన్ ఆడడంలో అత్యుత్తమం కాదని పేర్కొన్నారు. చాలా పాశ్చాత్య ఆటగాళ్లు వారి కంటే మెరుగ్గా ఉన్నారని వ్యాఖ్యానించారు. అశ్విన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం మనం స్పిన్‌లో అత్యుత్తమ ప్లేయర్లం కాదు. చాలా పాశ్చాత్య జట్లు మనకంటే మెరుగ్గా ఉన్నాయి. ఎందుకంటే వారు భారత్‌కు వచ్చి స్పిన్‌ను ప్రాక్టీస్ చేస్తున్నారు. మేం అంతగా సిద్ధం కాము' అంటూ వ్యాఖ్యానించాడు. భారత ఆటగాళ్లు ఫాస్ట్ బౌలింగ్‌ను అద్భుతంగా ఆడతారని అశ్విన్ తెలిపాడు. ఎందుకంటే దాన్ని సవాల్‌గా భావిస్తారని.. కానీ, స్పిన్‌కు అదే విధానాన్ని అవలంభిస్తున్నట్లుగా కనిపించడం లేదని తెలిపాడు. అలాగే, లెండజరీ బ్యాట్స్‌మన్ సునీల్ గవాస్కర్ సైతం ఓటమిపై స్పందించారు. భారత ఆటగాళ్లకు స్పిన్ బలహీనతకు ప్రధాన కారణం డొమెస్టిక్ క్రికెట్‌కు దూరంగా ఉండడమేనన్నారు. ఆటగాళ్లు దేశీయ క్రికెట్ ఆడరని.. రంజీలు ఆడితే అలాంటి పిచ్‌లపై ఆడటం అలవాటవుతుంది. దేశీయ క్రికెట్ జట్లు సైతం టర్నింగ్ పిచ్‌లను సిద్ధం చేస్తాయని.. కానీ, మన ఆటగాళ్లలో ఎంత మంది రంజీలు ఆడుతున్నారు అంటూ ఆయన ప్రశ్నించారు. ప్లేయర్లు దేశీయ సర్క్యూట్‌కు దూరంగా ఉన్నప్పుడు, టర్నింగ్ పిచ్‌లపై ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వర్క్‌లోడ్‌పై గవాస్కర్ విమర్శలు గుప్పించారు. చాలామంది ఆటగాళ్లు తమ ఫామ్ కోల్పోయిన సమయంలో మాత్రమే రంజీలు ఆడుతున్నారని.. మిగతా సమయంలో 'పనిభారం' పేరుతో దూరంగా ఉంటారన్నారు. స్పిన్ పిచ్‌లపై ఆడాల్సి వస్తే.. దేశీయ క్రికెట్ కంటే మెరుగైంది మరొకటి లేదని గవాస్కర్ స్పష్టం చేశారు. టీమ్ ఇండియాకు స్పిన్ పిచ్‌లపై ఆడగల నమ్మకమైన బ్యాట్స్‌మెన్ అవసరమైతే.. సెలెక్టర్లు దేశీయ క్రికెట్ ఆడే ఆటగాళ్లపై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు.

# టెన్నిస్ స్టార్ మనసుదోచిన లైలా..






**న్యూయార్క్:** పురుషుల టెన్నిస్ స్టార్ జన్నిక్ సినర్ మరో టైటిల్ సాధించాడు. ఏటీపీ ఫైనల్స్‌లో తనకు తగ్గపోటీదారుడైన కార్లోస్ అల్కరాస్‌ను చిత్తు చేసి ట్రోఫీని ఒడిసిపట్టాడీ ఇటలీ కెరటం. ఫైనల్లో విజయం తర్వాత ఆ అపూర్వ క్షణాలను ప్రత్యేకంగా మలచుకున్నాడు సినర్. తన ప్రేయసి లైలా హసనోవిక్‌తో గెలుపు సంబురాలు చేసుకున్నాడీ విజేత. ఏటీపీ ఫైనల్లో గెలుపొందిన తర్వాత ఆమెను హత్తుకొని విజయాన్ని ఆస్వాదించాడీ టెన్నిస్ సంచలనం. దాంతో.. ఈ అందగత్తె ఎవరు? అని అభిమానులు నెట్టింట వెతుకున్నారు.

టెన్నిస్‌లో ఇటలీ గర్వించదగ్గ విజయాలతో అదరగొడుతున్న జన్నిక్ సినర్ ఏటీపీ ట్రోఫీ నిలబెట్టుకున్నాడు. దిగ్గజ క్రీడాకారుడిగా ఎదుగుతున్న ఈ యంగ్‌స్టర్ ఫైనల్లో కార్లోస్ అల్కరాస్‌ను వరుస సెట్లలో (7-6, 7-5)తో ఓడించి విజేతగా నిలిచాడు. ట్రోఫీతో పాటు రూ.400 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకున్నాడు. అనంతరం భావోద్వేగానికి లోనైన అతడు గర్ల్‌ఫ్రెండ్ లైలా హసనోవిక్‌తో కలిసి సంబురాలు చేసుకున్నాడు. ఆమెను హగ్ చేసుకొని 'నేను ట్రోఫీ సాధించాను' అని మురిసిపోయాడు.

ఈమధ్యే తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని సినర్ బాహాటంగా ప్రకటించాడు. వియన్నా ఓపెన్ టోర్నీలో విజయం తర్వాత మాట్లాడుతూ లైలా హసనోవిక్‌కు ధన్యవాదాలు తెలిపాడు. ఇప్పుడు ఏటీపీ ఫైనల్ తర్వాత వీరిద్దరూ కలిసి సెలబ్రేట్ చేసుకోవడంతో ఔను వీరు ప్రేమలో ఉన్నారనే విషయం ప్రపంచమంతా తెలిసిపోయింది.

### 16 ఏళ్లకే మోడలింగ్..

టెన్నిస్ సంచలనం సినర్ మనసు గెలిచిన లైలా హసనోవిక్ కోపెన్‌హగన్‌లో జన్మించింది. బోస్నియాకు చెందిన దంపతులకు 2000 సంవత్సరం నవంబర్ 8న పుట్టిన తను స్వెన్‌బోర్గ్‌లో పెరిగింది. అమెరికాలోని కెంటకీలో చదివిన లైలా ప్రస్తుతం మోడల్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా రాణిస్తోంది. చినప్పటి నుంచి ఫ్యాషన్ రంగం మీద ఆసక్తితో 16 ఏళ్లకే మోడలింగ్‌లో అడుగుపెట్టింది. అందంతో పాటు తెలివితేటలున్న ఆమె 2019లో 'మిస్ డెన్మార్క్' ఫైనల్ వరకూ వెళ్లింది. ఆ ఈవెంట్‌తో అందాల సుందరిగా ప్రశంసలు అందుకున్న తను పలు సౌందర్య ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. ఇంకేముంది.. యువత మనసు కొల్లగొట్టిన ఆమెను ఇన్‌స్టాగ్రామ్‌లో 3.5లక్షల మంది ఫాలో అవుతున్నారు.

### మాజీ రేసర్ కుమారుడితో

సినర్‌తో రిలేషన్‌షిప్‌తో ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తున్న లైలా.. అతడికంటే ముందు మరొకరితో డేటింగ్ చేసింది. ఫార్ములా వన్ మాజీ రేసర్ మైఖేల్ షుమేకర్ కుమారుడు మిక్ షుమేకర్‌తో ప్రేమలో ఉంది. కొన్నాళ్లు డేటింగ్ చేసిన వీరిద్దరూ డాన్స్ వీడియోలతో వైరలయ్యారు. కానీ, ఏమైందో తెలియదు తమ బంధాన్ని త్వరగానే ముగించారు. ఆ తర్వాత సినర్‌ను ఇష్టపడిన లైలా అతడికి బలమైన మద్దతుదారుగా మారింది. అతడు ఆడే టోర్నమెంట్లలో తళుక్కుమంటూ.. చప్పట్లుకొడుతూ అతడిని ప్రోత్సహిస్తుంటుంది. టురిన్‌లో ముగిసిన ఏటీపీ ఫైనల్లోనూ లైలా పెంపుడు కుక్కతో కనిపించి.. మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

MOVIE TIME




## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న
# బాలకృష్ణ, బోయపాటి శ్రీను

**టాకీస్:** టాలీవుడ్ కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి శ్రీను కలిసి మంగళవారం ఉదయం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వీరితో పాటు చిత్ర నిర్మాత గోపీ అచంట కూడా ఉండడం విశేషం. బోయపాటి శ్రీను, బాలకృష్ణ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం అఖండ 2, అఖండ చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ విజయవంతం కావాలని చిత్రబృందం సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకుంది. అంతకుముందు బాలయ్య కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆయనను ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం అందించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలను చిత్రబృందం ఎక్స్ వేదికగా విడుదల చేసింది.

# త్వరలోనే ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తి




### దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన

**టాకీస్:** గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడించారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన '12ఎ రైల్వే కాలనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... 'చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.



# మహారాణి నయన అడుగు పెట్టింది

టాకీస్: నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.

# 'ధురంధర్' ట్రైలర్ రిలీజ్



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ధురంధర్'. ఈ సినిమాకు నేషనల్ అవార్డు విన్నర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం ఇది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ ట్రైలర్ చూస్తుంటే రణ్‌వీర్ సింగ్ ఇందులో రా ఏజెంట్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. స్పైగా పాకిస్తాన్‌కి వెళ్లిన రణ్‌వీర్ సింగ్ జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ. ఫుల్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం ఈ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు.



# రాజశేఖర్ సరసన మరోమారు రమ్యకృష్ణ

టాకీస్: యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు.

తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి ముద్దు గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్- రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.

**టాకీస్:** తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది. అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.

# పట్టాలకెక్కనున్న జై హనుమాన్




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.